క్లుప్తంగా

కోనమ్మ అమ్మవారికి లక్ష కుంకుమార్చన



మైలవరం: చిలుకూరివారిగూడెం శివారులో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన కోనమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. గ్రామ పురోహితులు బూరుగుల నాగేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చిలుకూరివారిగూడెం, కొత్తగూడెం, పుల్లూరు, దాసుళ్లపాలెం, వెల్వడం, చంద్రగూడెం, గణపవరం తదితర గ్రామాలకు చెందిన సుహాసినిలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

కాచవరం(ఇబ్రహీంపట్నం): రంజాన్ పండుగ సందర్భంగా కాచవరం గ్రామ పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులకు మండల ప్రభుత్వ ఖాజీ షేక్ నాగుల్‌మీరా నూతన వస్త్రాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం తాను సంపాదించిన దానిలో విధిగా కొంత పేదలకు, పుణ్య కార్యక్రమాలకు వెచ్చించాలన్నారు. పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 70 మంది గైర్హాజరు



నూజివీడు: నియోజకవర్గం పరిధిలోని 18 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం నిర్వహించిన బయాలజీ పరీక్షకు మొత్తం 3,488 మందికి గాను 70 మంది గైర్హాజరు కాగా 3,418 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. నూజివీడు పట్టణంతో పాటు మండలంలో 10 పరీక్ష కేంద్రాల్లో 1,874 మందికి గాను 1833 మంది హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 439 మందికి 433 మంది, ముసునూరు మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 596 మందికి 584 మంది, ఆగిరిపల్లి మండలంలో 579 మందికి 568 మంది హాజరయ్యారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



చాట్రాయి: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని ఎంపీడీఓ ఐ.వి జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రుణాల కోసం 840 మంది దరఖాస్తు చేసుకోగా 702 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని చెప్పారు.

ఘనంగా మర్లపాలెం పాఠశాల వార్షికోత్సవం



చాట్రాయి: విద్యార్థుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు పాఠశాలల వార్షికోత్సవాలు దోహదపడతాయని ఎంఈఓ బ్రహ్మాచారి అన్నారు. మర్లపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారిలో స్నేహ భావం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టిబాబు, ఉప సర్పంచ్ వెల్ది రాజారావు, ప్రధానోపాధ్యాయురాలు అనూష తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



ముసునూరు: మండలంలో 584 మంది విద్యార్థులు పదో తరగతి జీవశాస్త్ర పరీక్షకు హాజరయినట్లు ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ముసునూరు, చెక్కపల్లి, గోపవరం పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం జీవశాస్త్ర పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ముసునూరు, చెక్కపల్లి పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేశారు. ముసునూరు కేంద్రంలో 191 మంది, చెక్కపల్లిలో 275 మంది, గోపవరంలో 118 మంది పరీక్షకు హాజరయ్యారు.

నిరుపయోగంగా సామాజిక భవనాలు

- రూ.కోటితో నాలుగు భవనాల నిర్మాణం
- ఎన్నికలు రావడంతో మౌలిక సదుపాయాలకు బ్రేక్
- అందుబాటులోకి రాక రోడ్లపైనే శుభ కార్యక్రమాలు
- మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికుల వినతి



ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఆర్టీసీ కాలనీలో పార్కింగ్ ప్రదేశంగా వాడుతున్న కమ్యూనిటీ భవన స్థలం



పశ్చిమ ఇబ్రహీంపట్నంలో నిరుపయోగంగా మారిన ముస్లింల కమ్యూనిటీ హాల్ (షాదీఖానా)

ఇబ్రహీంపట్నం: కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి ప్రజల సామాజిక ప్రయోజనాల కోసం నిర్మించిన కమ్యూనిటీ భవనాలు నిరుపయోగంగా మారాయి. కొండపల్లి మున్సిపాల్టీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా అప్పటి ఎంపీ సుజనా చౌదరి నిధులు రూ.కోటి వ్యయంతో 4 సామాజిక భవనాలు నిర్మించారు. భవనాలు నిర్మించిన సమయానికి సార్వత్రిక ఎన్నికలు రావడంతో మౌలిక వసతుల కల్పనకు బ్రేక్ పడింది. ఆ తర్వాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా కమ్యూనిటీ భవనాలకు మౌలిక సదుపాయాలు కల్పించలేదు. భవనాలు ఉన్నప్పటికీ టాయిలెట్లు, ఆవరణలో ఫ్లోరింగ్, తాగునీటి సదుపాయం, ప్రహరీ వంటివి లేకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు శుభకార్యాలు రహదారులపై టెంట్లు వేసి జరుపుకునే పరిస్థితి నెలకొంది. కొందరు ప్రైవేట్ మండపాలను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

రూ. కోటితో నాలుగు భవనాల నిర్మాణం

అప్పటి ఎంపీ సుజనాచౌదరి నిధులతో కొండపల్లి పుట్లమ్మగట్టు, పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ముస్లింలకు షాదీఖానా, జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రాంతం, ఫెర్రీ ఆర్టీసీ కాలనీలో ఒక్కొకటి రూ.25 లక్షలు చొప్పున నాలుగు సామాజిక భవనాలు నిర్మించారు. భవనాలు నిర్మించి సదుపాయాలు కల్పించే సమయానికి సార్వత్రిక ఎన్నికలు రావడంతో మిగిలిన పనులు నిలిచిపోయాయి. తాగునీరు, భవనాల చుట్టూ, ఆవరణల్లో ఫ్లోరింగ్, ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్ల తదితర సదుపాయాలు లేకపోవడం వల్ల భవనాలు ప్రజలకు అక్కరకు రాకుండా పోయాయి.

రోడ్లపైనే శుభకార్యాలు

కొండపల్లి మున్సిపాల్టీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 1.03 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రస్తుతం పెరిగిన జనాభా ప్రకారం సుమారు 1.20 లక్షలకు చేరి ఉంటుందని అధికారులు లెక్కలు వేస్తున్నారు. పట్టణంలో ప్రతి ఏడాది సుమారు వెయ్యి వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. నూతనంగా కట్టిన సామాజిక భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో పూర్వం నిర్మించిన చాలీచాలని కమ్యూనిటీ భవనాలు, ప్రైవేట్ మండపాలను ఆశ్రయిస్తున్నారు. పూర్వపు సామాజిక భవనాల్లో నిర్వహణా లోపంతో అరకొరగా కార్యక్రమాలు జరుపుతున్నారు. ఆర్థిక స్తోమత లేని మరికొందరు రోడ్లు బ్లాక్ చేసి రహదారులపై టెంట్లు వేసి శుభకార్యాలు చేసుకుంటున్నారు. రోడ్లపై టెంట్లు వేసి బ్లాక్ చేయడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతనంగా నిర్మించిన భవనాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పట్టణ ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఆర్టీసీ కాలనీలో రూ.25 లక్షలతో సామాజిక భవనం నిర్మించారు. భవనం వద్ద తాగునీరు, టాయిలెట్లు, మెరక పనులు చేపట్టలేదు. శుభ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా లేదు. ప్రజల కోసం నిర్మించిన భవనం అక్కరకు రాలేదు. మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– పల్లె నరేష్, ఆర్టీసీ కాలనీ ఇబ్రహీంపట్నం

అందుబాటులోకి తేవాలి



పేద, మధ్య తరగతి ప్రజల కోసం సామాజిక భనాలు నిర్మించారు. ఎన్నికలు రావడంతో సామాజిక భవనాల్లో సదుపాయాలు కల్పించలేదు. మౌలిక సదుపాయాలు కల్పించి భవనాలను అందుబాటులోకి తేవాలి. తక్షణం ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– పచ్చిగోళ్ల పండు, స్థానికుడు, ఇబ్రహీంపట్నం

సదుపాయాలు కల్పిస్తాం

కొండపల్లి మున్సిపాల్టీలో నిర్మించిన నాలుగు కమ్యూనిటీ భవనాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. ఒకసారి నేను భవనాలు పరిశీలించి కావల్సిన అవసరాలు గుర్తిస్తా. వాటికి అంచనాలు తయారు చేయించి టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించి పనులు పూర్తి చేయిస్తాం. సామాజిక భవనాలు త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

–రమ్యకీర్తన, కమిషనర్, కొండపల్లి మున్సిపాలిటీ

నూతన కమిటీ సభ్యులకు జోగి రమేష్ అభినందన



పోరంకి శ్రీనివాసరాజును సత్కరిస్తున్న జోగి రమేష్ తదితరులు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ జిల్లా, మండల కమిటీల్లో నూతనంగా నియమితులైన కొండపల్లి మున్సిపాల్టీ పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు (బాబ్జీ), మండల అధ్యక్షుడు రెంటపల్లి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి మాజీ మంత్రి జోగి రమేష్‌ను మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. జోగి రమేష్ వారిని శాలువా, పుష్ప గుచ్చాలతో సత్కరించి అభినందించారు. పదవులు పొందేందుకు కృషి చేసిన జోగి రమేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెరుకు మాధవరావు, నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, గరికపాటి రాంబాబు, ఎంప బేగ్, బాలచందర్, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పెంపు

విస్సన్నపేట: ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే గడువు ఏప్రిల్ 9 వరకు పొడిగించినట్లు విస్సన్నపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాకర్ తెలిపారు. ఆన్‌లైన్లో ఈ దరఖాస్తులు సమర్పించాలని, 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. మైలవరం నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడిగా చామల సీతారామిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గోగులమూడి రాణి, రైతు విభాగం అధ్యక్షుడిగా ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా కుంచం జయరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నల్లమోతు కరుణ దయాకర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా భాగవత్ బాలాజీ నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌కే గౌస్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మండే చంద్రశేఖర్‌బాబు నియమితులయ్యారు. అలాగే స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా నంద కిశోర్ రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా పసుపులేటి రమేష్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడిగా కోమటి కోటేశ్వరరావు, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా వణకూరు రాంబాబు, వలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా తిరుపతి లక్ష్మీరాజు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా శీలం బ్రహ్మారెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా మాడుగుల వెంకట గిరిజ చంద్రశేఖర్, వీవర్స్ వింగ్ అధ్యక్షురాలిగా బట్టు లక్ష్మీ, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా వేమినీడి సూర్యనారాయణ, లీగల్ సెల్ అధ్యక్షుడిగా పత్తి పాటి రాము నియమితులయ్యారు. కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా మండెం సుబ్బారావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా లాం నవీన్, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా సందిపాము రాజేష్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా కోట చిన్న సంజీవరావు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా కొలకాను శ్రీనివాసరావు, ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా నక్క ప్రభుదాస్, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా మంద మధుబాబు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా చెన్నూరూ సుబ్బారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు

మైలవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు ఇంకొల్లు జమలయ్య డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా దామచర్లలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనపై శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మైలవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు జమలయ్య, సోషలిస్ట్ పార్టీ నాయకులు యలవర్తి నాగరాజు, కొండల రామారావు, ఓలేటి ఏసు, మైలవరం మండల, పట్టణ అధ్యక్షుడు దూరు దాసు, గౌరవ అధ్యక్షుడు మట్టకొయ్య సుధాకర్, బుద్దే యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల జాగారం



తిరువూరు జామియా మసీదులో లైలతుల్ ఖదర్ ప్రార్థనల్లో ముస్లింలు

తిరువూరు: రంజాన్ మాసంలో పవిత్ర లైలతుల్ ఖదర్ కార్యక్రమాన్ని గురువారం రాత్రి తిరువూరు జామియా మసీదులో నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు, జాగారంలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇస్లాం మత గురువులు పవిత్ర ఖురాన్ పఠనం చేసి, లైలతుల్ ఖదర్ విశిష్టతను వివరించారు. అల్లా కరుణ పొందినవారు గత జన్మల పాపాల నుంచి విముక్తులవుతారని, రంజాన్ మాసంలో అల్లా చూపిన మార్గంలో నడవాలని మత గురువులు బోధించారు. తిరువూరులోని బిలాల్ మసీదు, కౌసర్ మసీదు, మసీద్ ఏ అన్సర్, మసీద్ ఏ అబూబకర్‌లలో కూడా లైలతుల్ ఖదర్ జాగారం కార్యక్రమం జరిగింది. పలు గ్రామాల్లో ముస్లింలు పవిత్ర రంజాన్ మాస ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నంలో పాస్టర్ల శాంతి ర్యాలీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. మండలంలోని క్రైస్తవ సంఘాల పాస్టర్లు పెద్ద సంఖ్యలో చేరి నిరసన వ్యక్తం చేశారు. నలుపు రంగు ప్లకార్డులు పట్టుకుని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ ప్రమాదవశాత్తు మరణించలేదన్నారు. ఆయన హత్యకు గురయ్యారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయని చెప్పారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శాంతి ర్యాలీలో పాస్టర్లు మోగులూరి ఎలీషా, అబ్రహాం, మెజెస్, శ్యాంసుందర్, సాల్మన్, పాల్, ఇస్మాయేల్, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి సేద్యంతో బహుళ ప్రయోజనాలు

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి



విస్సన్నపేట: భూసారం పెంపునకు నవ ధాన్యాలు నాటాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి రైతులకు సూచించారు. విస్సన్నపేట వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఖరీఫ్ సాగుపై కార్యాచరణ సమావేశం నిర్వహించారు. విజయకుమారి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకంతో భూసారానికి తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు. ప్రకృతి సేద్యంతో బహుళ ప్రయోజనాలున్నాయని వివరించారు. ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంచుకుని నాణ్యమైన కూరగాయలు పండించుకోవాలని సూచించారు. వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ రాజశ్రీ, వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి, ఏపీఎం జమలయ్య, వ్యవసాయ, వెలుగు, ప్రకృతి సేద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాంబాబుకు సన్మానం



ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన కంబాల రాంబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆగిరిపల్లి మండల ఉపాధ్యక్షుడు మల్లంపల్లి రవిశేఖర్, కంబాల ప్రదీప్‌లు కంబాల రాంబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.

బాల్య వివాహాలను అరికడదాం

బాలల హక్కుల జిల్లా కో–ఆర్డినేటర్ రవిబాబు

నూజివీడు: బాల్య వివాహాల వల్ల జీవితంలో అనేక ఒడిదొడుకులకు లోనవుతారని, శారీరకంగా, మానసికంగా అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని బాలల హక్కుల జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.రవిబాబు అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల నష్టాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, దీనికి శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. ఎవరైనా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు లేదా 112 పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. హెచ్ఎం వీవీఎస్ సత్యనారాయణ, ఆర్.వినోద్ కుమార్ పాల్గొన్నారు.

నవోదయకు వివేకానంద విద్యార్థుల ఎంపిక

మైలవరం: మైలవరం వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు కె. భాను ఫణీంద్ర, ఎం. ఏంజల్ 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతికి నవోదయలో సీటు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ పి.రాజారెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం వీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుద్యోగులను మోసం చేయడం దారుణం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేయడం దారుణమని సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎన్టీటీపీఎస్ ఐదో స్టేజ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని 23 మంది నుంచి రూ.23 లక్షలు వసూలు చేసిన వారిని తక్షణం విధుల నుంచి తొలగించి వారి నుంచి బాధితులకు నగదు రికవరీ చేయాలని కోరారు. బాధితుల పక్షాన సీఐటీయూ పోరాటం చేస్తుందన్నారు.

విద్యార్థులకు హౌస్ హోల్డ్ ప్రొడక్ట్స్ తయారీలో శిక్షణ



మైలవరం: విద్యార్థులు నిత్య జీవితంలో ఇంటిలో ఉపయోగించే డిటర్జంట్ లిక్విడ్, డిటర్జంట్ పౌడర్ తదితర వస్తువులు వారే తయారు చేసుకునే విధంగా శిక్షణ ఇస్తున్నామని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు తెలిపారు. కళాశాలలో విజయవాడ జన శిక్షణ సంస్థాన్ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల హౌస్ హోల్డ్ ప్రొడక్ట్స్ తయారీలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇన్‌స్ట్రక్టర్ జి. రమేష్ విద్యార్థులకు డిటర్జెంట్ లిక్విడ్, డిటర్జంట్ పౌడర్, క్యాండిల్స్ తయారీలో శిక్షణ ఇచ్చి విద్యార్థులతో తయారు చేయించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.ఫణికుమార్, మేజర్ మన్నే స్వామి, మరియన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం

- మంత్రి కొలుసు పార్థసారథి
- ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం



తుక్కులూరులో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు: మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్లను ఉచితంగా పంపిణీ చేస్తుందని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మండలం తుక్కులూరు, పట్టణంలో శుక్రవారం టైలరింగ్ శిక్షణ కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో 700 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తామన్నారు. 90 రోజులపాటు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి 75 శాతం హాజరుతో శిక్షణ పొందిన వారికి నిబంధనల మేరకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరేపల్లి శిరీష, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.పుష్పలత, మున్సిపల్ కమిషనరు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆందోళన



తిరువూరు నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తిరువూరు: తిరువూరు పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పాత తిరువూరులో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని, అర్హులైన నిరుపేదలకు మూడు సెంట్ల చొప్పున నివేశన స్థలాలివ్వాలని, కృష్ణా నది నుంచి తాగునీటి సరఫరాకు చేపట్టిన పైలట్ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్లకు మరమ్మతులు చేయించాలని, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, కోతులు, కుక్కల బెడద నివారించాలని కోరుతూ నగర పంచాయతీ కమిషనర్ లోవరాజుకు వినతి పత్రం సమర్పించారు. నాయకులు పంతంగి తులసీరాణి, గుళ్లపల్లి వెంకటరత్నం, ఎస్‌పీ భద్రం, బలగాని వెంకటేశ్వరరావు, ఆకుల రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్‌లపై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు, ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: విజయవాడ జోనల్ పరిధిలో ఇటీవల కాలంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై విధిస్తున్న అక్రమ సస్పెన్షన్లకు వ్యతిరేకంగా ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజన సమయంలో యూనియన్ డిపో చైర్మన్ కె.నరసింహారావు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షుడు డీవీ రావు మాట్లాడుతూ జీఓ నంబర్ 1/2019కి వ్యతిరేకంగా అధికారులు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. జీఓకు అనుకూలంగా వ్యవహరించాలని గతంలో ఆర్టీసీ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని చెప్పారు. అయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. సస్పెన్షన్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు అంజనేయులు, శంకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో ప్రభుత్వ అధికారులు

నూజివీడు: టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో అధికారులు పాల్గొనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా దర్బార్ పూర్తిగా టీడీపీ కార్యక్రమమని అందులో అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఎలా పాల్గొంటారని ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు మున్సిపల్ కమిషనర్ సైతం పురపాలక సంఘం కౌన్సిలర్లందరికి రాతపూర్వకంగా ప్రజా దర్బార్‌కు ఆహ్వానిస్తూ సర్క్యులర్‌లు పంపడమేంటని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌ను టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేస్తే కమిషనర్‌తో పాటు మున్సిపాలిటీకి చెందిన ఇతర అధికారులు, తహసీల్దార్, ఎంపీడీఓ తదితర కార్యాలయాల అధికారులు, సిబ్బంది సైతం పాల్గొనడం విమర్శలకు తావిస్తోంది.